సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 10 । మే । 2024

రాముడిని హేళన చేసినోళ్లకు ఓటేయొద్దు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్


బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: రాముడిని, అక్షింతలను హేళనచేసిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓట్లు వేయొద్దని కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ సూచించారు. కరీంనగర్ పరిధిలోని అల్గునూర్‌లో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతుందని అంటున్నవారే.. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా దేవుడిపై ఒట్టు వేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గతంలో ఎంపీలుగా ఉన్న వారు వేములవాడకు ఏనాడైనా ప్రధానిని తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. దక్షిణ కాశీగా పేరున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న తొలి ప్రధాని మోదీ అన్నారు. కోడ్ ఉన్నప్పుడు ఎన్నికల సభలో నిధులు, హామీలు ఇవ్వకూడదనే అకల్ కూడా బీఆర్‌ఎస్ నాయకులకు లేదన్నారు.

ప్రసాద్ స్కీమ్ కోసం లేఖ రాస్తా

వేములవాడ ఆలయాభివృద్ధికి ప్రసాద్ స్కీంలో నిధులు మంజూరు చేయాలని ఎన్నికలు ముగియగానే కేంద్రానికి లేఖ రాస్తానని సంజయ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తప్పించుకునేందుకే కాంగ్రెస్ గెలుపు కోసం బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, ఎడ్ల జోగిరెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, సొల్లు అజయ్‌వర్మ, సుగుర్తి జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుట్ర చేస్తున్నాయి

గంగాధర: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నేతల మాదిరిగా ఫోన్ ట్యాపింగ్ డబ్బులతో ఓట్లు కొనాలనుకునే వాళ్లం తాము కాదని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఓటుకు రూ.వెయ్యి పంచాలని కుట్రలు చేస్తున్నాయని బండి సంజయ్‌కుమార్ అన్నారు. గంగాధర మండలంలోని వెంకటాయిపల్లి గ్రామ పరిధిలోని ప్రయివేటు పంక్షన్‌హాల్‌లో గురువారం చొప్పదండి నియోజకవర్గ పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశం జరిగింది. సంజయ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో చేసిన పనులు చెప్పుకొని ఓట్లు అడిగేవాళ్లు బిచ్చగాళ్లయితే తాము కూడా బిచ్చగాళ్లమేనని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మాదిరిగా అవినీతి సొమ్ముతో, ఫోన్ ట్యాపింగ్ డబ్బులు పంచి ఓట్లు కొనుగోలు చేయడం తమకు చేతకాదన్నారు. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్‌శాతం పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నుంచి బీజేపీలో చేరినవారికి సంజయ్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి

- కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు


మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు, కేకే మహేందర్‌రెడ్డి, చొప్పదండి ప్రకాశ్, సత్యనారాయణ

సిరిసిల్ల: నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేలా వస్త్రోత్పత్తి ఆర్డర్లు ప్రభుత్వం ఇస్తుందని కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం పవర్‌లూమ్ వస్త్రపరిశ్రమ, అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రూ.10లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు, రైతుభరోసా వంటి ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. మిగతా హామీలను త్వరలోనే అమలు చేస్తుందన్నారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేసి తీరుతుందన్నారు. సిరిసిల్ల నేతన్నలకు గత ప్రభుత్వం రూ.275 కోట్ల బకాయిలు పెడితే వాటిని చెల్లించేందుకు రేవంత్‌రెడ్డి చొరవ చూపారని గుర్తుచేశారు. నేతకార్మికులకు యారన్ సబ్సిడీ డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. ఎంపీగా తనకు ఒక్క అవకాశం ఇస్తే.. అభివృద్ధి నమూనాను చూపిస్తానన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, చక్రధర్‌రెడ్డి, గడ్డం నర్సయ్య, కాముని వనిత, యెల్లె లక్ష్మీనారా యణ, వస్త్రవ్యాపారులు తాటిపాముల దామోదర్, బూట్ల నవీన్‌కుమార్, మండల సత్యం, కార్మిక నాయకులు మూషం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణచౌక్‌లో హాజరైన జనం


అభివాదం చేస్తున్న కేసీఆర్

గులాబీ దళపతికి నీరాజనం

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వాగతం
- రాంనగర్ నుంచి భారీ ర్యాలీ
- తెలంగాణచౌక్‌లో రోడ్‌షో
- తరలివచ్చిన జనం.. కిక్కిరిసిన కరీం'నగరం'
- కార్నర్ మీటింగ్ సక్సెస్.. బీఆర్‌ఎస్‌లో జోష్

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం కరీంనగర్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా జిల్లాకేంద్రంలో జరిగిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కేసీఆర్ మొదట ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఉజ్వలపార్కు మీదుగా రాంనగర్ చౌరస్తాకు భారీ కాన్వాయ్‌తో సరిగ్గా రాత్రి 7.50 నిమిషాలకు చేరుకున్నారు. రాంనగర్ చౌరస్తాలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌బాబు, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, చలిమెడ లక్ష్మీనరసింహారావు, సర్దార్ రవీందర్‌సింగ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీమేయర్ చల్లా స్వరూపరాణి-హరిశంకర్‌లు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి తెలంగాణచౌక్ వరకు 40నిమిషాల పాటు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దారిపొడవునా బాణసంచా పేలుస్తూ, ఒగ్గుడోలు కళాకారులు, డప్పు చప్పుళ్లతో, మహిళలు మంగళహారతులతో నీరాజనం పలికారు. 40 నిమిషాలపాటు సాగిన ర్యాలీలో కేసీఆర్ ప్రజలకు బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగుతూ కార్యకర్తల్లో జోష్‌పెంచారు. 8.30 గంటలకు తెలంగాణచౌక్‌కు చేరుకున్న కేసీఆర్ బస్సుపై నుంచి అభివాదం చేస్తూ 10 నిమిషాల పాటు అభివాదం చేస్తూ ఉత్తేజం నింపారు. 25నిమిషాల పాటు చేసిన ప్రసంగంతో తెలంగాణచౌక్‌కు తరలివచ్చిన జనం సీఎం కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు చేసినప్పుడల్లా కేరింతలు, అరుపులతో సభా ప్రాంగణమంతా దద్దరిల్లింది. ప్రసంగం ప్రారంభంలో కరీంనగర్ భీముడు, అభివృద్ధి ప్రదాత గంగుల కమలాకర్ అనడంతో జనం హర్షధ్వానాలు పలికారు. పాడికౌశిక్‌రెడ్డిని హుజురాబాద్ టైగర్ అంటూ కేసీఆర్ పొగడ్తలతో ముంచెత్తారు. స్మార్ట్‌సిటీ తెచ్చిన వినోద్‌కావాలా... నయాపైసా తేని బండి సంజయ్ కావాలో ఆలోచించాలని అనడంతో.. సభ నుంచి భారీ స్పందన వ్యక్తమైంది. రోడ్‌షోకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల ముఖ్యనేతలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో నగరం గులాబీమయంగా మారింది.


కళాకారుల ఆటపాట


అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



తెలంగాణచౌక్‌లో భవనాలపై నుంచి కేసీఆర్ ప్రసంగం వింటున్న ప్రజలు

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

- స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాస్

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ ఏపీడీ గొట్టె శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల శివారులోని అపెరల్ పార్క్‌లో గురువారం గ్రీన్ నిడిల్ సంస్థ ఉద్యోగులకు, సిబ్బందికి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 13న అర్హులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. గ్రీన్ నిడిల్ సంస్థ జీఎం మతిన్ అహ్మద్, హెచ్ఆర్ మేనేజర్ ఫణి, డీపీఎం, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీవోగా నరేశ్‌కుమార్


నరేశ్‌కుమార్

సిరిసిల్ల: జిల్లా డివిజనల్ పంచాయతీ ఆఫీసర్(డీఎల్‌పీవో)గా బి.నరేశ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య గురువారం తెలిపారు. జిల్లా డీఎల్‌పీవోగా పనిచేసిన ఆర్.మల్లికార్జున్ రిటైర్డు కాగా.. ఆయన స్థానంలో వీర్నపల్లి మండల పంచాయతీ ఆఫీసర్(ఎంపీవో)గా పనిచేస్తున్న బి.నరేశ్‌కుమార్‌ను నియమించారు. కలెక్టర్ ఆదేశాలతో పూర్తిస్థాయి డీఎల్‌పీవోగా నరేశ్‌కుమార్ విధుల్లో చేరారని డీపీవో వెల్లడించారు.

మాజీ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య


మాట్లాడుతున్న బొడ్డు దేవయ్య

సిరిసిల్ల: రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సర్పంచ్‌లకు పెన్షన్ ఇవ్వాలని, స్థానికంగా అర్హులకు ప్రభుత్వ భూములు కేటాయించాలని కోరుతూ ఐదేళ్లుగా పోరాడుతున్నామన్నారు. జిల్లా కేంద్రంలో రిలేదీక్షలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయమై బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లకు విన్నవిస్తే.. తమ సమస్యలను కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేందర్‌రావుకు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. పెద్దపల్లి, నిజామాబాద్, మెదక్ పార్లమెంట్ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపునూరి మల్లేశం గౌడ్, ప్రతినిధులు చందనగిరి గోపాల్, దేవుని నర్సయ్య, బుర్ర మల్లేశంగౌడ్, నాలుక సత్యం, గజ్జెల స్వామి పాల్గొన్నారు.

ఆలయంలో ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు



వేములవాడ: రాజన్న ఆలయంలో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను గురువారం చేపట్టారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

స్కూళ్లలో మరమ్మతులు చేయండి

- పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, ఖీమ్యానాయక్

సిరిసిల్ల: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన స్కూళ్లలో మరమ్మతు పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ ఈఈలతో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం వీడియో కన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్కూళ్లలో విద్యుత్ సరఫరాలో లోపాలు సరిచేయాలని, ఫ్యాన్లు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల వద్ద నీటి సరఫరా సరిగ్గా ఉందా.. లేదా.. చూసుకోవాలని సూచించారు. తాగునీటి ట్యాంకు వద్ద నల్లాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటివసతి, టెంటు, ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎస్.ఖీమ్యానాయక్, జెడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, డీఈవో రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్


ఆశిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

రుద్రంగి(వేములవాడ): ఎన్నికల సమయంలో రెచ్చగొట్టే మాటలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. రుద్రంగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రిటికల్, నార్మల్ పోలింగ్ కేంద్రాలను, పోలీస్ చెక్‌పోస్టును గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. మానాల గ్రామంలో ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా నిర్ణీత సమయం కన్నా ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. యువత గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని కోరారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ తదితరులు ఉన్నారు.

కేసుల పాలు కావొద్దు

చందుర్తి(వేములవాడ): ఎన్నికల వేళ కేసుల పాలు కావొద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. చందుర్తి మండలం రామన్నపేటలో పోలింగ్ కేంద్రాన్ని, ఆశిరెడ్డిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసుల పాలైతే ప్రతీ ఎన్నికలప్పుడు పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. విదేశాలకు వెళ్లేందుకు పాసుపోర్టు కూడా రాదన్నారు. యువకులు గంజాయి మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐలు వెంకటేశ్వర్లు, వెంకటేశ్, చందుర్తి, రుద్రంగి, వేములవాడ ఎస్సైలు శ్రీకాంత్, అశోక్, మారుతి పాల్గొన్నారు.

నేడు సిరిసిల్లలో కేసీఆర్ రోడ్ షో

- భారీ జనసమీకరణలో బీఆర్ఎస్ శ్రేణులు
- సిరిసిల్ల నేతన్న చౌక్ వద్ద కేసీఆర్ ప్రసంగం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం రోడ్ షో నిర్వహించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు రోడ్‌షోలో పాల్గొంటారు. పాతబస్టాండులోని నేతన్నచౌక్‌లో ప్రసంగిస్తారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. భారీ జన సమీకరణకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు పార్టీ శ్రేణులకు ఇప్పటికే సంకేతాలు అందించారు. ఈమేరకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతోపాటు బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల నుంచి భారీగా పార్టీ శ్రేణులను, ప్రజలను సిరిసిల్లకు తరలించాలని భావిస్తున్నారు. కేసీఆర్ రోడ్ షో నేపథ్యంలో పట్టణ వీధులు గులాబీ జెండాలతో నిండిపోయాయి. ఈ రోడ్‌షో ద్వారా బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపి.. పార్టీ అభ్యర్థి గెలుపునకు బాటలు వేయాలని ఆ పార్టీ ముఖ్యనేతలు భావిస్తున్నారు.

కొత్త చెరువు నుంచి నేతన్న చౌక్ వరకు..

సిరిసిల్ల కార్మికక్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు నిర్వహించే బస్సు యాత్ర.. రోడ్ షో ఏర్పాట్లను గురువారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. స్థానిక కొత్తచెరువు నుంచి నేతన్న చౌక్ వరకు నిర్వహించే రోడ్‌షోలో గులాబీ బాస్ కేసీఆర్ ప్రసంగిస్తారు.


కేసీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు గురువారం రాత్రికే సిరిసిల్లకు చేరుకుని రోడ్‌షో ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

వెయ్యి మంది కళాకారులతో కవాతు

వెయ్యి మంది కళాకారులతో కవాతు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, ప్రయాణికులు సహకరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఏర్పాట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరు ప్రవీణ్, రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, కె.మల్లారెడ్డి, విజయరమణారావు పరిశీలించారు.

జిల్లా ప్రజలను నిరాశపరచిన ప్రధాని మోదీ


మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: జిల్లాకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ రాజన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సిరిసిల్లలో బహిరంగసభ నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి కూడా జిల్లా అభివృద్ధిపై, రైతన్న, నేతన్నల సంక్షేమంపై నోరు మెదపలేదన్నారు. అటు సీఎం.. ఇటు పీఎం జిల్లాపై వివక్ష చూపడం శోచనీయమన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాబలం బీఆర్ఎస్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. 10వ తేదీన సిరిసిల్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గూడూరి ప్రవీణ్, మ్యాన రవి, గుండ్లపెల్లి పూర్ణచందర్, దార్ల సందీప్, బొల్లి రామ్మోహన్, కల్లూరి రాజు తదితరులున్నారు.

మాకు దక్కిన గౌరవం


ప్రధాని మోదీకి ప్రసాదం అందిస్తున్న ప్రధాన అర్చకుడు భీమాశంకరశర్మ, అర్చకుడు శరత్‌శర్మ


కోడెమొక్కు వద్ద అర్చకుడు చందు, సిబ్బంది గొట్టం శ్రీనివాస్

- ప్రధానికి సేవ చేసిన అర్చకుల మనోగతం
- ప్రధాని వెంట నలుగురు అర్చకులు... ఒకరు సిబ్బంది
- ముందస్తు మూడు రోజులు శిక్షణ
- 8 నిమిషాల్లో పూజలు పూర్తి

వేములవాడ: రాజరాజేశ్వరస్వామికి ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా పూజలు చేయించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ప్రధానిని దగ్గరి నుంచే చూడడంతోపాటు తమ చేతులమీదుగా పూజలు చేయించడంతో ఈ జీవితానికి దక్కిన అరుదైన అవకాశమని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా భద్రత సిబ్బంది ఆధీనంలో ఉన్న రాజన్న ఆలయం గురువారం తెరుకుంది. ఈ సందర్భంగా ప్రధాని సేవలో తరించిన అర్చకులు, సిబ్బందిని 'సాక్షి' పలకరించగా.. వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మూడు రోజులు ట్రయల్స్..
8 నిమిషాల్లో పూజలు పూర్తి

ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా ఎస్పీజీ బృందం ఆధ్వర్యంలో మూడు రోజులుగా శిక్షణ, ట్రయల్స్ నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. తమ ఆధార్‌కార్డు పరిశీలించడంతోపాటు మెడికల్ చెకప్ కూడా చేసినట్లు వివరించారు. పూజలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందే అవగాహన కల్పించారన్నారు. మోదీ పూజలు చేసే సమయంలో ఆలయంలో ప్రధాన అర్చకుడు అప్పాల భీమాశంకరశర్మ, అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ, మామిడిపల్లి శరత్‌శర్మ, చందు, సిబ్బంది గొట్టం శ్రీనివాస్ మాత్రమే విధుల్లో ఉన్నారు. మోదీ ఆలయంలోకి ప్రవేశించిన 8 నిమిషాల్లోనే శ్రీలక్ష్మీగణపతి పూజ, నందీశ్వరుడి పూజ, శ్రీస్వామి వారి దర్శనం, అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం పూర్తి చేసినట్లు అర్చకులు వివరించారు.

బొట్టు..ప్రసాదం చెక్

రాజన్నను దర్శించుకున్న ప్రధాని మోదీకి పెట్టే బొట్టు మొదలుకొని ఇచ్చే ప్రసాదం వరకు క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అందజేసినట్లు అర్చకులు వివరించారు.

రిటైర్‌మెంట్‌కు ముందు దక్కిన సదవకాశం



వచ్చే జనవరిలో నా రిటైర్‌మెంట్ ఉంది. రాజన్న దీవెనలతో దేశ ప్రధానికి సేవలందించే భాగ్యం లభించింది. ఇది నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నా. ఈ అనుభూతి జీవితంలో మరిచిపోలేను. – అప్పాల భీమాశంకరశర్మ, ఆలయ స్థానాచార్యులు



పూర్వజన్మ సుకృతం

పధానితో పూజలు చేయించడం పూర్వజన్మ సుకృతం. ఐదుగురు అర్చకులకు మాత్రమే అవకాశం కల్పించడం, అందులో మేముండడం గర్వంగా ఉంది. ఇంతటి అనుభూతిని జీవితంలో మరచిపోలేము. ప్రధానికి పూజలు చేయడంతో మమ్మల్ని మోదీ అర్చకులు.. అని పిలుస్తున్నారు.
– చంద్రగిరి శరత్‌శర్మ, మామిడిపల్లి శరత్‌శర్మ

సంతోషంగా ఉంది



ప్రధాని కోడె మొక్కు చెల్లించుకునేటప్పుడు అర్చకుడు చందుతో కలిసి నేను పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ప్రధానిని దగ్గరి నుంచి చూసే భాగ్యం కలిగింది. భద్రత సిబ్బంది మూడు రోజుల నుంచే శిక్షణ ఇచ్చారు. వారు చెప్పిన విధంగానే మెదులుకున్నాను.
– గొట్టం శ్రీనివాస్, కోడె మొక్కు సిబ్బంది

రాజన్న సేవలో ఐజీ



వేములవాడ: రాజన్నను ఐజీ రాజేశ్‌కుమార్ సక్సేనా గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

బోధనాస్పత్రిలో వైద్యుల నిరసన



సిరిసిల్లటౌన్: వైద్యులపై దాడులు నిలువరించాలని కోరుతూ సిరిసిల్ల జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ) నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కోరుట్లలో విధి నిర్వహణలో ఉన్న వైద్యుడు శ్రావణ్‌కుమార్, సిబ్బందిపై ఓ రోగి బంధువులు జరిపిన అకారణ దాడిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీజీడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, వైద్యులు అరుణ్‌కుమార్, సుప్రియ, సంతోష్, సాయిరాజ్, శృతి, సాయికుమార్, సుగుణ, ఎం.లక్ష్మీనారాయణ, జయశ్రీ, వరుణ్, సాయికృష్ణప్రియ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

- కరెంట్‌షాక్‌తో చేపలు పడుతూ మృత్యువాత
- సింగారం మానేరులో ఘటన
- పరారీలో మరో ఇద్దరు


రోదిస్తున్న మృతుని కుటుంబీకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని మానేరువాగులో చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సింగారం గ్రామంలో విషాదం నింపింది. ఎస్సై రమాకాంత్, గ్రామస్తులు తెలిపిన వివరాలు. సింగారం గ్రామానికి చెందిన ముత్యాల బాలకృష్ణ(35) గురువారం మధ్యాహ్నం మనేరువాగు చెక్‌డ్యాంలో చేపలు పట్టేందుకు అదే గ్రామానికి చెందిన బొమ్మిడి శంకర్, పూటకుల్ల సుధీర్‌తో కలిసి వెళ్లాడు. వీరు ముగ్గురు గత మూడు రోజులు మానేరువాగులో కరెంట్‌షాక్ పెడుతూ చేపలు పడుతున్నారు. ఈక్రమంలో గురువారం ముగ్గురు కలిసి చేపలు పడుతున్నారు. బాలకృష్ణ తన చేతిలో కర్రకు విద్యుత్‌తీగను పెట్టుకొని చేపలు పడుతున్నాడు. సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న కరెంట్ స్టార్టర్ వద్ద శంకర్ ఉండి ఫ్యూజులకు వైర్లను తగిలించాడు. చేపలు పడుతుండగా కరెంట్ వైరు ఊడి బాలకృష్ణపై పడడంతో షాక్‌కు గురయ్యాడు. ఈ విషయం గమనించిన సమీపంలో ఉన్న సుధీర్ కేకలు వేయడంతో శంకర్ సంఘటన స్థలానికి పరుగెత్తుకొని వచ్చాడు. బాలకృష్ణ పడి ఉండడాన్ని చూసి తిరిగివెళ్లి కరెంట్ స్టార్టర్ వద్ద ఫ్యూజులు తీసి వేశాడు. తర్వాత బాలకృష్ణకు నీటిలో నుంచి ఒడ్డుకు చేర్చి చూడగా అప్పటికే మరణించాడు. దీంతో శంకర్, సుధీర్ పరారయ్యారు. అదే గ్రామానికి చెందిన కొందరు చెక్‌డ్యాంలో స్నానం చేయడానికి వెళ్లగా బాలకృష్ణ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చేపలు పట్టడానికి తన భర్తను తీసుకెళ్లిన శంకర్, సుధీర్‌లే చంపారంటూ మృతుని భార్య కావ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య కావ్య, ఇద్దరు కూతుళ్లు సహస్ర, లాస్య, కుమారుడు అఖిల్‌తేజ్ ఉన్నారు.


బాలకృష్ణ(ఫైల్)

వెండితెరపై పల్లెటూరు పిల్లాడు

- బ్రహ్మచారి హీరో జిల్లా వాసి
- నేడు థియేటర్లలో విడుదల
- ఇప్పటికే యూట్యూబ్‌లో మల్లేశం ఫేమస్


మల్లేశంకు సత్కారం



వేములవాడరూరల్: పల్లెటూరులో పుట్టిపెరిగిన యువకుడు వెండితెరపై వెలుగులు చిమ్మేందుకు హీరో అయ్యాడు. పేదరికాన్ని ఎదురిస్తూనే తనలోని కళను బయటపెట్టుకునేందుకు యూట్యూబ్‌లలో వీడియోలు చేసే వాడు. గత పదిహేనేళ్లుగా 500 పాటలు, యూట్యూబ్ చానెళ్లలో వంద వరకు కార్యక్రమాలు చేసి ఔరా అనిపించుకున్నాడు. ఇప్పు డు ఏకంగా సినిమాలో నటించి వెండితెరపై మెరవనున్నాడు వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్‌కు చెందిన గుంట మల్లేశం.

పల్లెటూరు నుంచి వెండితెరకు

ఫాజుల్‌నగర్‌కు చెందిన గుంట లింగవ్వ–ఇస్తారి దంపతుల పెద్దకుమారుడు గుంట మల్లేశం. ఇటిప్ప వరకు ఐదు సినిమాల్లో సైన్యం, సైదులు, బ్రహ్మచారి, రాజుగాడు రాజైతే.., శివ శంభో నటించారు. ఇందులో రెండు సినిమాలు సైన్యం, సైదులు గతంలో విడుదలయ్యాయి. మూడో సినిమా బ్రహ్మచారి శుక్రవారం విడుదల కానుంది. మరో రెండు సినిమాలు రాజుగాడు రాజైతే.., శివశంభో పెండింగ్‌లో ఉన్నట్లు మల్లేశం తెలిపారు. సినిమా విడుదలవుతున్న సందర్భంగా కళాకారులు, అభిమానులు మల్లేశంన సత్కరించారు. వేములవాడలోని నృత్య కళానికేతన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎల్ల పోచెట్టి, గంగయ్య, నాగరాజు పాల్గొన్నారు.

శంకర జయంతి ఉత్సవాలు ప్రారంభం


పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో శంకర జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం ఉదయం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, పారాయణాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజు సాయంత్రం కల్యాణ మండపంలో భగవత్ శంకరాచార్యుల పారాయణాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తామని వివరించారు. శ్రీపార్వతీ అమ్మవారికి చతుషష్ఠి పూజ నిర్వహిస్తామన్నారు.

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి
- సెక్టార్ ఆఫీసర్స్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ బాధ్యులకు శిక్షణ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమి

సిరిసిల్ల: సెక్టార్ ఆఫీసర్స్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ బాధ్యులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సిరిసిల్ల ఏఆర్వో పరిధిలోని సెక్టార్ ఆఫీసర్స్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ బాధ్యులకు శిక్షణ ఇచ్చారు. అదనపు కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఈనెల 12న ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, 13న రిసెప్షన్ సెంటర్ల వద్ద నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి వివరించారు. టీమ్ వర్క్‌గా ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. సిరిసిల్ల ఏఆర్వోలో 30 సెక్టార్లు ఏర్పాటు చేశామని, రిజర్వ్ సిబ్బంది ఉంటారని తెలిపారు. సిబ్బంది కేటాయించిన వాహనంలోనే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని స్పష్టం చేశారు. సెక్టార్ ఆఫీసర్స్ తమ పరిధిలోని పీవోలు ఇవ్వాల్సిన పత్రాలు అన్ని తీసుకొని రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్ బాధ్యులు అన్ని పత్రాలు జాగ్రత్తగా చూసుకొని తీసుకోవాలన్నారు. సిరిసిల్ల ఆర్డీవో రమేశ్, మాస్టర్ ట్రెయినర్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.